క్లుప్తంగా

23న మాలల సింహ గర్జన



పోస్టర్లు విడుదల చేస్తున్న నేతలు

పుంగనూరు: తిరుపతిలో ఈనెల 23న మాలల సింహగర్జన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఆర్.అశోక్, శ్రీనివాసులు తెలిపారు. వారు గురువారం అంబేడ్కర్ సర్కిల్‌లో సింహగర్జన పోస్టర్లు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ మాలల సమస్యలను పరిష్కరించుకునేందుకు ఐకమత్యంగా పోరాటాలు చేయాలన్నారు. తిరుపతిలో జరిగే సభకు విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. జేవీ.నాగరాజు, కృష్ణప్ప, అంజి, కుమార్, కామిరెడ్డి, మంజు పాల్గొన్నారు.

పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి

రొంపిచెర్ల: పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి ఆదేశించారు. ఆయన గురువారం రొంపిచెర్ల ఉన్నత పాఠశాలలో పోషన్‌బీ- పడాయి బి. శిక్షణతరగతులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు పోషకాహారం అందించడంతోపాటు మెరుగైన ఆరోగ్యం, విద్య కూడా అవసరమన్నారు. చిన్నవయసులోనే అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిస్తే తర్వాత వారు విద్యలో రాణిస్తారని పేర్కొన్నారు. ఎంఈఓ శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రకాష్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

23, 24 గంగజాతర



బలి పోతుకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

సదుం: మండల కేంద్రంలో ఈనెల 23, 24 గంగజాతర వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ పెద్దలు గురువారం బలిపోతుకు పూజలు చేశారు. అనంతరం మేళ తాళాలతో గ్రామంలో ఊరేగించారు. ఇళ్ల వద్ద మహిళలు బలిపోతుకు పూజలు చేశారు.

పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న సూపర్‌వైజర్లు

చౌడేపల్లె: పిల్లల విద్యతోపాటు ఆరోగ్యంపైనా దృష్టి సారించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమాదేవి, సులోచన తెలిపారు. చౌడేపల్లె ప్రాథమిక పాఠశాలలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషన్‌బీ- పడాయిబీ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఆరేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. వారికి విద్యతోపాటు ఆట, పాటలు నేర్పించాలని సూచించారు. పౌష్టికాహారం అందించిగ్రోత్ మానిటరింగ్ నిర్వహించాలన్నారు.

ముగిసిన ఆరిమాను గంగమ్మ జాతర



గంగమ్మ ఆలయంలో వెంకటేగౌడ

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లి పంచాయతీ కల్లాడులో వెలసిన ఆరిమాను గంగమ్మ ఆలయంలో జాతర అమ్మవారి జలధితో గురువారం ముగిసింది. ఇక్కడి జాతరలో తొమ్మిది గ్రామాలకు చెందిన వారు పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆమేరకు ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద పండరి భజనలు, పౌరాణిక, సాంఘిక నాటకాలు, కోలాటాలు, హరికథలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈద్గాలలో పారిశుధ్య పనులు

పుంగనూరు: రంజాన్ పండుగను పురస్కరించుకుని పుంగనూరు పట్టణంలోని ఎస్ఎస్.పేట, తోపుమఠం వద్దనున్న ఈద్గాల వద్ద పారిశుధ్య పనులు చేపట్టినట్టు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి గురువారం తెలిపారు. ఎస్ఎస్.పేట ఈద్గా వద్ద ముస్లింలు ప్రార్థనలు జరుపుకోవడం ఆనవాయితీ. ఈక్రమంలో ఆ ప్రాంతంలోని మైదానాన్ని, మురుగు కాలువలను శుభ్రం చేశారు. అలాగే శ్మశాన వాటికను బాగు చేయించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణవేణి, ఆర్‌ఐ నరేంద్రరాజు పాల్గొన్నారు.

పలమనేరు దాహార్తిని తీర్చే వైఎస్సార్ జలాశయంలో అడుగంటిన నీరు



పలమనేరు పట్టణ వ్యూ



- ఎండుతున్న వైఎస్సార్ జలాశయం
- రూ.91లక్షలతో నిధులకు వినతి
- నిధులు ఆలస్యమైతే మంచినీటి సమస్య

నీటి గండం తప్పేదా..?

పలమనేరు: జిల్లాలో ఎక్కడ మంచినీటి సమస్యలున్నా పలమనేరు మున్సిపాలిటీలో మాత్రం వేసవిలోనూ పెద్దగా తాగునీటి సమస్యలుండేవికాదు. ఇదంతా గతం. ఇప్పుడు పట్టణానికి మంచినీటినందించే కాలువపల్లి వైఎస్సార్ జలాశయం నుంచి నీటి సరఫరా పూర్తిగా ఆగిపోయింది. కేవలం మున్సిపల్ బోర్ల ద్వారా అందే నీటినే పట్టణవాసులకు సరఫరా చేస్తున్నారు. ఆమేరకు పట్టణంలో ప్రతి మనిషికి రోజుకు 75 లీటర్ల నీటిని అందించాల్సి ఉండగా ఇప్పుడు 55 లీటర్లను మాత్రమే ఇస్తున్నారు. ఆమేరకు మనిషికి 20 లీటర్ల నీటి కొరత నెలకొంది. వచ్చే వేసవిలో తాగునీటి సమస్యల పరిష్కారానికి మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి పాలకవర్గంతో కలిసి ముందస్తుగానే నిధులను విడుదల చేయాలని కోరింది. కానీ నిధులు ప్రభుత్వం నుంచి విడుదలైతేగానీ మున్సిపాలిటీలో మంచినీటి సమస్య తీరే పరిస్థితుథేమాత్రం కనిపించడంలేదు.

వైఎస్సార్ జలాశయం నుంచి చుక్కనీరు రాలేదు

మున్సిపాలిటీలో 96 స్కీమ్ బోర్లున్నాయి. వీటి నుంచి 3.1 ఎంఎల్‌డీ నీరు అందేది. ఇందులో ఇటీవల కౌండిన్య నదిలో ఇసుక తవ్వకాల కారణంగా పది బోర్లలో భూగర్భ జలాలు అడుగంటి నీరు రాకుండా ఎండిపోయాయి. ఫలితంగా వస్తున్న నీరు తగ్గుముఖం పట్టింది. మండలంలోని కాలువపల్లి జలాశయంలో నీరున్నప్పుడు నిత్యం పది ఎంఎల్‌డీ నీరు ఇక్కడి ప్లాంట్‌కు చేరేది. కానీ గత ఆరు నెలలుగా వైఎస్సార్ జలాశయం ఎండిపోయింది. దీంతో పట్టణానికి మంచినీటి సరఫరా ఆగింది. ఇప్పటికే ఎండలు దంచుతున్న నేపథ్యంలో మంచినీటి సమస్యపై చర్యలు తీసుకోకుంటే ఏప్రిల్, మే నెలల్లో మంచినీటి సమస్య తప్పేలా లేదు.

నిధులు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరాం

ఇలా ఉండగా పట్టణంలో నెలకొంటున్న మంచినీటి సమస్య పరిష్కారానికి కొత్తబోర్ల తవ్వకం, బోర్ల డీపెనింగ్, వాటర్ ట్రాన్స్‌పోర్ట్‌లకు రూ.91లక్షల అంచనాతో నిధులకు అంచనాలను పంపినట్టు మున్సిపల్ ఏఈ స్నేహలత సాక్షికి తెలిపారు. అయితే ప్రభుత్వం నుంచి నిధులు వస్తేగాని పనులు ముందుకెళ్లవన్నారు. ఇదే విషయమై మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి మాట్లాడుతూ తాజాగా జరిగిన మున్సిపల్ మీట్‌లో మంచినీటి సమస్య పరిష్కారం కోసం ట్రాక్టర్ల ద్వారా మంచినీటి సరఫరా కోసం మార్చి నుంచి మే దాకా రూ.30లక్షల జనరల్ ఫండ్స్‌తో చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఏదేమైనా మంచినీటి సమస్య పరిష్కారంలో నిధులు త్వరగా రాకుండా పోతే మరో పదిరోజుల నుంచి పట్టణంలో నీటి కష్టాలు తప్పేలాలేవు. దీనిపై జిల్లా కలెక్టర్ చొరవ చూపాలని పట్టణవాసులు కోరుతున్నారు.

మనిషికి రోజుకు 75 లీటర్లు కష్టమే

పట్టణ జనాభా ప్రస్తుతం 60 వేలకు చేరింది. ప్రభుత్వ నిబంధనల మేరకు మనిషికి రోజుకు 75లీటర్ల నీటిని అందించాల్సి ఉంది. కానీ ఇప్పుడు రోజుకు 55లీటర్లు మాత్రమే అందుతోంది. కొన్ని ప్రాంతాల్లో మూడు రోజులకోసారి మంచినీటి సరఫరా జరుగుతోంది. దీంతో పట్టణవాసులు ప్రైవేటు నీటి ట్యాంకర్లను కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వేలం పాట బహిష్కరణ



ఈఓపీఆర్డీకి వినతి ఇస్తున్న గ్రామస్తులు

పెద్దపంజాణి: మండలంలోని కొళత్తూరు పంచాయతీకి చెందిన చెరువుల్లో చేపలు పట్టుకునే హక్కు కోసం గ్రామ పంచాయతీ అధికారులు గురువారం స్థానిక సచివాలయం వద్ద బహిరంగ వేలం పాట నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో పలు గ్రామాల ప్రజలు వేలంలో పాల్గొనేందుకు సచివాలయం వద్దకు చేరుకున్నారు. అయితే పంచాయతీలోని పెద్దచెరువైన రాయలచెరువు మినహా మిగతా చెరువులకు వేలం పాట నిర్వహిస్తామని అధికారులు చెప్పడంతో గ్రామస్తులు మూకుమ్మడిగా వేలం పాటను బహిష్కరించారు. ఈమేరకు పంచాయతీలోని అన్ని చెరువులకు వేలం నిర్వహించాలని ఈఓపీఆర్డీ శారదా దేవి, పంచాయతీ కార్యదర్శి రాజేష్‌కు వినతి పత్రం అందజేశారు. దీనిపై ఈఓపీఆర్డీని వివరణ కోరగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. ఇదిలాఉండగా మత్స్యశాఖ పలమనేరు వారు గ్రామ పంచాయతీ పాలక వర్గం, పంచాయతీ అధికారులకు తెలియకుండా రాయల చెరువులో చేపలు పట్టుకునే హక్కును మండలంలోని ఓ సొసైటీకి కేటాయించినట్లు గ్రామ పంచాయతీ ప్రజలు ఆరోపిస్తున్నారన్నారు. జిల్లా అధికారులు స్పందించి సొసైటీకి ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని వారు కోరుతున్నారు.

యానాది కాలనీలో సికిల్‌సెల్ అనీమియా పరీక్షలు



చౌడేపల్లె యానాది కాలనీలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పవన్‌కుమార్

చౌడేపల్లె : మండల కేంద్రమైన చౌడేపల్లెలోని యానాది కాలనీలో గురువారం వైద్యాధికారి పవన్ కుమార్ పిల్లలకు సికిల్‌సెల్ అనీమియా పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పిల్లలు తరచూ అనారోగ్యం బారిన పడడం, రోజూ వారీ పనులు చేసుకోకపోవడం, వెంటనే అలసిపోవడం, గుండెదడ తదితర లక్షణాలు ఉంటే సికిల్‌సెల్‌గా గుర్తించాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి తిరుపతి స్విమ్స్‌లో ప్రత్యేక పరీక్షలు చేసి ఉచితంగా రక్తమార్పిడి చేస్తారని తెలిపారు. ఎన్టీఆర్ పెన్షన్ పథకం కింద నెలకు రూ.10 వేలు అందజేస్తారని వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బహుద్దీన్, ఏఎన్ఎం రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల కూల్చివేతపై నిరసన



నిరసన తెలుపుతున్న బాధితులు, నేతలు

శాంతిపురం: మఠం పంచాయతీలోని సంతూరులో ఇళ్ల కూల్చివేతకు గురైన 9 ఎస్సీ, బీసీ కుటుంబాలకు న్యాయం చేయాలని బహుజన సేన నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వారు మండల సచివాలయం వద్ద నిరసన ప్రదర్శన చేసి తహసీల్దార్ శివయ్యకు వినతి పత్రం అందించారు. బాధితులతో పాటు బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు, రాష్ట్ర కార్యదర్శి గోవిందప్ప, జిల్లా అధ్యక్షుడు సతీష్, ఉపాధ్యక్షుడు కుమార్, నేతలు గణేష్, గిన్నెల మనోహర్‌రెడ్డి, భానుప్రకాష్ పాల్గొన్నారు.

పురుగు మందుల వాడకం వద్దు



వస్తువులతో రైతులు, అధికారులు, అధ్యాపకులు

పలమనేరు: పంటలకు అధికంగా పురుగు మందులను వాడకంతో మేలు కంటే నష్టాలే ఎక్కువని ఎస్వీ అగ్రికల్చర్ కాలేజీ అధ్యాపకులు డా. ప్రదీప్ రైతులకు సూచించారు. ఆమేరకు మండలంలోని కూర్మాయిలో ఎస్సీ కులాల రైతులకు సస్యరక్షణలో మందుల వినియోగం, సంరక్షణ పద్ధతులపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. రైతులకు మాస్కులు, గ్లౌజ్‌లు, కళ్లజోళ్లను అందజేశారు. హార్టికల్చర్ అధ్యాపకులు కార్తీక్‌రెడ్డి, ఏఓ సంధ్య, సిబ్బంది స్పందన పాల్గొన్నారు.

పిచ్చుకలను కాపాడుకుందాం



పిచ్చుకలతో ఉపయోగాలను వివరిస్తున్న వనపర్తి వెంకటసిద్ధులు

పులిచెర్ల(కల్లూరు) : అంతరించిపోతున్న పిచ్చుకలను కాపాడుకుందామని నేషనల్ గ్రీన్ కోర్ మాస్టర్ వనపర్తి వెంకటసిద్ధులు తెలిపారు. కల్లూరు హైస్కూల్‌లో గురువారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. పిచ్చుకల మనుగడ కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీవాణి, రాజేంద్ర, వేణుగోపాల్, రేణుక పాల్గొన్నారు.

బార్ నూతన కార్యవర్గం ఎంపిక



నూతన బార్ కార్యవర్గం

పలమనేరు: పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎల్.భాస్కర్ ఎంపికయ్యారు. ఆమేరకు స్థానిక కోర్టు వద్ద గురువారం జరిగిన ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. గౌరవాధ్యక్షుడిగా లక్ష్మీపతి, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, షరీఫ్, ప్రధాన కార్యదర్శిగా భర్కత్, సంయుక్త కార్యదర్శిగా రవి, కోశాధికారిగా ఫామీద్‌బాషా, లైబ్రేరియన్‌గా ఇబ్రహీం, క్రీడల కార్యదర్శిగా రంజిత్‌షాలను ఎంపిక చేశారు. న్యాయవాదులు పాల్గొన్నారు.

కార్యదర్శుల నూతన కార్యవర్గం ఎంపిక

వి.కోట: గురువారం మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం ఏర్పాటు చేసుకున్నట్లు ఎంపీడీఓ ఈశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పంచాయతీ కార్యదర్శులు సమావేశం ఏర్పాటు చేసుకుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వివరించారు. కమిటీ అధ్యక్షుడిగా శివశంకర్(వి.కోట ప్రధాన సచివాలయ కార్యదర్శి), గౌరవాధ్యక్షులుగా వెంకటరమణ(ఈఓపీఆర్డీ), ఉపాధ్యక్షులుగా ప్రవీణ, శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా సోమశేఖర్, సంయుక్త కార్యదర్శిగా హర్షజ, కోశాధికారిగా దేవేంద్ర, ప్రధాన సలహాదారుగా సురేష్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికైన సభ్యులను ఎంపీడీఓ అభినందించారు.

గంగజాతరను పటిష్టంగా నిర్వహిస్తాం



పుంగనూరులో జాతర ఏర్పాట్లపై చర్చిస్తున్న కమిషనర్ మధుసూదన్‌రెడ్డి

పుంగనూరు: పట్టణ జమిందారుల కులదైవం నుగుటూరు గంగమ్మ జాతరను ఈ నెల 25, 26 తేదీల్లో వైభవంగా నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం ప్యాలెస్ ఆవరణలో జాతర ఏర్పాట్లను పరిశీలించారు. అమ్మవారికి నిర్వహించే తొలి పూజ కార్యక్రమాల మండపం, ప్యాలెస్ ముందు జరిగే కార్యక్రమాలకు చేయాల్సిన పనులపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణవేణి, ఆర్‌ఐ నరేంద్రరాజు, సచివాలయ ఉద్యోగులతో చర్చించి మున్సిపల్ కార్మికులకు పలు సూచనలు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. అలాగే పట్టణంలోని ముఖ్యమైన రహదారులు, కూడలి ప్రాంతాల్లో హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గతంలో జాతరలో పోలీసుల కారణంగా భక్తులు, మున్సిపల్ ఉద్యోగులు, పట్టణ ప్రముఖులు ఇబ్బందులు పడ్డారు. ఈ ఏడాది అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. పలమనేరు డీఎస్పీతో చర్చించి పాసులు ఉన్న వారిని అనుమతించేలా చూస్తామని హామీ ఇచ్చారు.

ఏకలవ్య కాలనీ పుస్తకానికి పురస్కారం



బాలాజీ

పలమనేరు: తెలుగు సాహిత్యంలో పలమనేరు బాలాజీ రాసిన ఎరుకుల కథా సంపుటి ఏకలవ్య కాలనీ పుస్తకానికి పురస్కారం వరించింది. శ్రీమతి గీతాంజలి స్మారక పురస్కారం–2025కు ఎంపికైందని నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం అధ్యక్షురాలు కరణం విమల పుస్తక రచయితకు గురువారం సమాచారం ఇచ్చారు. గత మూడున్నర దశాబ్దాలుగా తెలుగు సాహితీ రంగంలో తనదైన శైలితో బాలాజీ పాఠకులను ఆకట్టుకుంటున్నారు. త్వరలో ఆయన పురస్కారాన్ని అందుకోనున్నారు. పురస్కారానికి ఎంపికైనందుకు ఆయన్ను స్థానిక రచయితలు, సాహిత్యాభిమానులు అభినందించారు.

బ్లాక్‌లో స్టాంప్ పేపర్ల అమ్మకాలు

పుంగనూరు: పట్టణంలోని స్టాంపు వెండర్లు స్టాంపులు, స్టాంప్ పేపర్లను బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంపుల కొరత ఎక్కువగా ఉండడంతో బ్లాక్‌లో స్టాంపుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రూ.100ల అగ్రిమెంటు స్టాంప్ పేపర్‌కు రూ.200 అధికంగా తీసుకుంటున్నారు. అలాగే రూ.10, రూ.20, రూ.50 పేపర్లను రెట్టింపు ధరకు అమ్ముతున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై సీనియర్ అసిస్టెంట్ అహ్మద్‌బాషాను వివరణ కోరగా రూ.50, రూ.100 స్టాంపులు వారం రోజులుగా స్టాక్ లేదన్నారు. మిగిలినవి సరఫరా చేస్తున్నామన్నారు. బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయించడంపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

ఉపాధి సిబ్బంది బదిలీ

పెద్దపంజాణి: మండలంలోని ఉపాధి హామీ పథకంలో జూనియర్ ఇంజినీర్ నాగమణి సోమలకు, టెక్నికల్ అసిస్టెంట్లు వెంకటరమణారెడ్డి గంగవరానికి, దేవేంద్ర శాంతిపురం, కంప్యూటర్ ఆపరేటర్ ప్రవీణ్‌కుమార్ పుంగనూరు మండలానికి బదిలీ అయ్యారు. అదేవిధంగా పలమనేరు నుంచి జూనియర్ ఇంజినీర్ సుబ్రమణ్యం, పుంగనూరు, గంగవరం నుంచి టెక్నికల్ అసిస్టెంట్లు జయచంద్ర, సత్యనారాయణ, పలమనేరు నుంచి కంప్యూటర్ ఆపరేటర్ హరిప్రసాద్ బదిలీపై ఇక్కడకు వచ్చినట్లు ఎంపీడీఓ బాలాజి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

బకాయి జీతాలు చెల్లిస్తాం

కుప్పం: ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న 206 మంది ఉద్యోగులకు గత సంవత్సర కాలంగా జీతాలు చెల్లించకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై ప్రభుత్వం సైతం వారికి ఫైనాన్స్ అప్రూవల్‌తో పాటు జీతాలు చెల్లించేందుకు వర్సిటీ అధికారులు పంపిన ఫైళ్లను తిరస్కరించడం తెలిసిందే. దీనికి సంబంధించి 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈక్రమంలో డీఎస్పీ పార్థసారథి, వర్సిటీ అధికారులు, యూనియన్ నాయకులతో సమావేశమై చర్చించారు. గురువారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డా.సురేష్‌బాబు వీసీ ఆచార్య దొరస్వామితో సమావేశమయ్యారు. అనంతరం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో మాట్లాడుతూ వీలైనంత త్వరలో పెండింగ్ జీతాలను చెల్లించేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు.

నోటీస్ బోర్డు

- **నేడు హుండీ లెక్కింపు**

చౌడేపల్లె: మండల కేంద్రమైన చౌడేపల్లెలోని శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రూప్ టెంపుల్స్ ఈఓ కమలాకర్ ప్రకటనలో తెలిపారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

చౌడేపల్లె: స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం చౌడేపల్లె మండలంలోని అంగన్‌వాడీ సిబ్బందికి పోషణ్ బీ- పడాయిబీ కార్యక్రమంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సూపర్‌వైజర్లు రమాదేవి, సులోచన తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

రొంపిచెర్ల: రొంపిచెర్ల కస్తూర్బా గురుకుల పాఠశాలలో 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కేజీబీవీ ప్రత్యేక అధికారి సుజాత తెలిపారు. ఆమె గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరంలో 40 సీట్లు ఉన్నాయని తెలిపారు. అలాగే 7,8,9, తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తులను మార్చి 22 నుంచి ఏప్రిల్ 11 వరకు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 7075159996, 7075039990 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

నేడు భాస్కర్‌రెడ్డి వర్ధంతి

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లెలో శుక్రవారం దివంగత పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి 31వ వర్ధంతి నిర్వహించనున్నారు. ఇందులో మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొననున్నారు. ఈ మేరకు కుటుంబసభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజశేఖరబాబు

పులిచెర్ల(కల్లూరు) : పులిచెర్ల హైస్కూల్‌లో గురువారం మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషన్ బీ-పడాయిబీపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీఓ రాజశేఖరబాబు మాట్లాడుతూ పిల్లల అభివృద్ధి, నైపుణ్యం పెంపొందించడానికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు సిద్ధరామయ్య, తాతయ్య, హెచ్ఎం సయ్యద్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, రమాదేవి పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ సదస్సు

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఈనెల 21, 22 తేదీల్లో భాగవతం భక్తి తాత్వికత, సామాజికత అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్టు సదస్సు సంచాలకులు ఈ.వాసు, ప్రిన్సిపల్ వెంకటేశులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు వివిధ విశ్వవిద్యాలయాల నుంచి ఆచార్యులు, అధ్యాపకులు పాల్గొని పత్ర సమర్పణ చేస్తారని తెలిపారు. తెలుగు సాహితీ అభిమానులు, స్థానిక కవులు, రచయితలు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని అందులో కోరారు.

నీలగిరి తోటలో అగ్నిప్రమాదం

పుంగనూరు: మండలంలోని బైలుగానిపల్లి సమీపంలోని వెంకట్రమణకు చెందిన నీలగిరితోటలో గురువారం అగ్నిప్రమాదం జరిగింది. మంటలు చెలరేగడంతో స్థానికులు గమనించి అగ్నిమాపకశాఖ అధికారి సుబ్బరాజుకు సమాచారం అందించారు. సమాచారం మేరకు సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. గుర్తుతెలియని వ్యక్తులు బీడీ, సిగరెట్లు తాగి పడేయంతో మంటలు చెలరేగి ఉంటాయని, దీంతో లక్ష రూపాయల మేరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతులు తెలిపారు.